సీకే బాబుకు భద్రత కల్పించాలి: సీకే లావణ్య

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూర్ మాజీ ఎమ్మెల్యే సీకే బాబు భద్రత సిబ్బంది తొలగింపుపై ఆయన సతీమణి సీకే లావణ్య ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కట్టమంచిలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్న సీకే బాబుపై 8సార్లు హత్యాయత్నం జరిగిందని 8ప్లస్8 గన్ మెన్స్ ఉన్న సమయంలోనే హత్యా ప్రయత్నం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం 2ప్లస్2 గన్ మెన్స్ ఉన్నారని వీరిని కూడా ప్రస్తుతం తొలగించడం సరికాదన్నారు. ఎన్నికల తరుణంలో విశ్వతంగా జనం మధ్యలో తిరుగుతున్న సమయంలో ప్రభుత్వం భద్రత సిబ్బందిని తొలగించడం దారుణమని భద్రతా సిబ్బందిని పునరుద్ధరించాలని కోరారు.

దేశాన్ని బలహీనపరిచే సిఏఏ చట్టాన్ని అడ్డుకుందాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం అమలు కోసం నిబంధనలు ప్రకటించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. శుక్రవారం చిత్తూరులోని మసీదుల వద్ద ముస్లిం సోదరులకు సిఏఏ చట్టంను వ్యతిరేకించాలని విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. సిపిఎం జిల్లా నాయకులు సురేంద్రన్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన దేశ సమైక్యతకు ప్రమాదకరమైన ముస్లిం మైనార్టీలను లక్ష్యం చేసుకొని ప్రకటించిన ఈ సీఏఏ నిబంధనలను వెంటనే ఉపసరించుకోవాలని డిమాండ్ చేశారు. 2019లో ఆమోదించబడిన సిఏఏ చట్టాన్ని ప్రజా ఆందోళన వల్ల ఐదేళ్లు మూలన పెట్టి ఇప్పుడు కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని దాన్ని అమలుపరిచేందుకు నిబంధన నోటిఫికేషన్ ప్రకటించడం స్పష్టంగా ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు బిజెపి ఆడుతున్న ప్రమాదకరమైన నాటకంలో భాగమేనని అన్నారు. ఈ చట్టం వలన దేశంలో ఉద్రిక్తలు ఏర్పడతాయన్నారు. మన లాంటి రాష్ట్రంలో అశాంతి నెలకొంటుందన్నారు. ఇలాంటి చట్టాన్ని ప్రజలందరూ కూడా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఐదవ అధికరణం నుండి 11వ అధికరణం వరకు పౌరసత్వం గురించిన విధివిధానాలు నిర్దేశించారు. వాటి ఆధారంగా ఉనీకిలోకి వచ్చిందే పౌరసత్వ చట్టం 1955 ప్రకారం ఈ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి ఆ వ్యక్తి వారసులుగా ఉన్న ప్రతి వ్యక్తి భారతీయుడైనను తేల్చి చెప్పింది. ఈ దేశంలో నివసించడానికి సిద్ధపడిన వారిని కూడా సహజసిద్ధంగా పౌరసత్వం సంక్రమిస్తుందని ఈ చట్టం స్పష్టం చేసిందన్నారు. కానీ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఆమోదించిన పౌరసత్వ చట్టం కుల, ప్రాంత, లింగ, జాతి సాంస్కృతిక పరమైన విభజనకు అతీతంగా భారతీయులందరికీ సమాన పౌరుషత్వ హక్కు కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతుందన్నారు. అందువల్ల పౌరసత్వ సవరణ చట్టం ఈ దేశంలోని ముస్లిముల సమస్య కాదన్నారు. అది దేశ రాజ్యాంగానికి లౌకిక ప్రజాస్వామ్యానికి ముంచుకొస్తున్న ప్రమాదానికి సంబంధించిన సమస్యగా అభివర్ణించారు. లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగం స్థానంలో హిందూ రాష్ట్ర ఏర్పాటుకు ఆర్ఎస్ఎస్ బిజెపిలో చేస్తున్న ప్రయత్నాల్లో నాడు బాబ్రీ మసీదు కూల్చివేత, నేడు జమ్మూ కాశ్మీర్‌ను చేర్చడం 370అధికరణ రద్దు ప్రస్తుత సవరణ చట్టం తేవడం ఇందులో భాగమేనన్నారు. ఈ దశలోనే త్రిప్పి కొట్టకపోతే అమీషా చెప్పినట్లు రేపు దేశమంతటా ఎన్ఆర్సి అమలు నిరాగాటకంగా పూనుకుంటారన్నారు. అప్పుడు భారతీయులైన మనం భారతీయులమేనని నిరూపించుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూలైన్లో నిల్చుకొని పత్రాలు సమర్పించాల్సి వస్తుందని ఆయన వివరించారు. ప్రజలంతా ఏకమై పౌరసత్వం చట్టాన్ని త్రిప్పి కొట్టాలని సిపిఎం పిలుపునిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన సిఏఏ స్పెషల్స్‌ను చిత్తూరు నగరంలో ముస్లిం సోదరులలో విశేష స్పందన లభించింది. అందరూ ఐక్యంగా ఎదుర్కొందామని ముస్లిం సోదరులు పిలుపునిచ్చారు.

సీఏఏపై 'ప్రజాశక్తి' ముద్రించిన ప్రత్యేక సంచికను చూపుతున్న ముస్లింలు

రేపే గ్రూప్-1 పరీక్ష

- 3 కేంద్రాలు, 2517మంది అభ్యర్థులు
- ఏర్పాట్లలో అధికారులు బీజీబీజీ

మూడు కేంద్రాలు ఇవే..
ఎస్‌వి సెట్ (ఆర్‌వీఎస్ నగర్)
సీతమ్స్ కాలేజీ
పవికేఎన్ డిగ్రీ కాలేజీ

ఉదయం ఇలా..
పేపర్-1 10గంటల నుంచి 12గంటల వరకు
మధ్యాహ్నం ఇలా..
పేపర్-2 2గంటల నుంచి 4గంటల వరకు

APPSC

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో అధికారులు నిమఘ్నమైయ్యారు. ఆదివారం ఉదయం ఈ పరీక్ష జరగనుంది. పరీక్ష కేంద్రాల్లో కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. చిత్తూరు జిల్లా నుంచి 2517మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా వారికి సంబంధించి మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 నిర్వహించేలా రూపకల్పన చేశారు.

క్షణం ఆలస్యమైనా నో ఎంట్రీ..

పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. క్షణం ఆలస్యమైనా అనుమతించరు. ప్రభుత్వ గుర్తింపు కార్డు ఎదైనా వెంట తీసుకొని రావాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రంలోకి హాల్ టికెట్ బాల్ పెన్నును మాత్రమే అనుమతిస్తారు. సెల్‌ఫోన్‌లు, సాంకేతిక పరికరాలు, డిజిటల్ ఫోన్లు అనుమతి ఉండదు.

పకడ్బంది ఏర్పాట్లు..

పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచన మేరకు అధికారులు ఇప్పటికే పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు నియంత్రణలో ఈ పరీక్షలు నిర్వహించ బడతాయన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేద, పటిష్ఠ బందోబస్తు, కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాల వద్ద అభ్యర్థులకు కావలసిన ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, వైద్య సదుపాయాలు, అదనపు ఆర్టీసీ బస్సులు నడిపేలా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. డీఆర్వో పర్యవేక్షణలో ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేశారు.

అందుబాటులో కంట్రోల్ రూం..

అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసుకొనేలా ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. అందుకు అనువుగా ప్రత్యేకంగా ఫోన్ నెంబరును అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు 9491077356 నెంబర్‌కి సంప్రదించవచ్చునని అధికారులు సూచించారు.

పరీక్ష కేంద్రాల వద్ద సర్వం సిద్ధం..



డీఆర్వో పుల్లయ్య

పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. శుక్రవారం చిత్తూరులో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుం దన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

తెల్లారేసరికి...సర్దుకున్నారు..!

- తిరుపతిలో ఆరణి శ్రీనివాస్ ప్రచారం
- సుగుణమ్మకు న్యాయం చేస్తామని హామీ
- పవన్ మాటే వేదం అంటున్న పసుపులేటి
- సత్యవేడు నుంచి పోటీ చేస్తా : జేడీ రాజశేఖర్

నిన్న ఆరణికి వ్యతిరేకంగా...

నేడు ఆరణితో కలిసి ప్రచారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ పోటీలో ఉంటారని ప్రకటించిన వెంటనే జనసేన, టిడిపి నాయకులు ఊగిపోయారు.. 'ఆరణి గో బ్యాక్' అంటూ గురువారం ప్రతాపం చూపారు. శుక్రవారం రామతులసి కల్యాణ మండపంలో మరోసారి సమావేశం అయ్యి 'లోకల్'కు ప్రాధాన్యత ఇవ్వాలని అధినేతల దృష్టికి తీసుకెళ్లాలనుకున్నారు.. తెల్లారేసరికి ఏమయ్యిందో తెలియదు.. ఆలయానికి ఆరణి శ్రీనివాస్, పసుపులేటి హరిప్రసాద్ కలిసి వచ్చారు. కాకతాళీయంగానే అయినా అదే ఆలయంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి భూమన అభియన్‌రెడ్డి ఎదురుపడి పలకరించుకున్నారు. ఏమైతేనేం తెల్లారేసరికి 'నిప్పు' చల్లారింది. సుగుణమ్మకు ప్రోటోకాల్ పరిధిలో పదవి ఇచ్చి న్యాయం చేస్తామని అధినేత నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చినట్లు సమాచారం. తిరుపతిలో టిడిపి శ్రేణుల్లో నిరుత్సాహాన్ని పోగొట్టే బాధ్యతను సుగుణమ్మపైనే ఉంచినట్లు తెలుస్తోంది. తిరుపతిలో వలస వచ్చిన ఆరణి శ్రీనివాస్‌కు టిడిపి, జనసేన నేతలు ఆహ్వానం పలికితే, సత్యవేడులో ఆదిమూలం స్థానంలో జేడీ రాజశేఖర్ అయిన తానే పోటీ చేస్తానని స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టారు. అధినేత చంద్రబాబునాయుడు తనకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. తెల్లారేసరికి మార్పులు చేర్పులతో తిరుపతిలో జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాస్ ఒకే అయ్యారు. అయితే సత్యవేడులో జేడీ రాజశేఖర్ పోటీ చేస్తానని ప్రకటించడంతో అధినేత చూపు ఆదిమూలం వైపు ఉంటుందో, జేడీ రాజశేఖర్ వైపు ఉంటుందో వేచి చూడాల్సిందే.

శుక్రవారం తిరుపతి స్థానికులంతా కలిసి రామతులసి కల్యాణ మండపంలో సమావేశం అవ్వాలని భావించినా ఆ సమావేశం వాయిదా పడింది. పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవడం వల్లనే గురువారం రగిలిన 'అగ్గి' చల్లారిపోయిందని తెలుస్తోంది. శుక్రవారం తిరుపతి జనసేన ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు కపిలేశ్వర ఆలయం వద్ద అభయ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. తర్వాత గంగమ్మ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. జనసేన అధినేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆరణి శ్రీనివాస్‌తో కలిసి ఉండటం విశేషం. గురువారం ఓ హోటల్లో జరిగిన సమావేశంలో పసుపులేటి హరిప్రసాద్ హాజరై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. తెల్లారేసరికి ఆరణి శ్రీనివాస్‌తో కలిసి ప్రత్యక్షమయ్యారు. అయితే తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ మాత్రం ప్రచారంలో ఎక్కడా కనబడలేదు. శుక్రవారం జరగాల్సిన సమావేశం వాయిదా పడిందని, త్వరలో మరో తేదీ ప్రకటిస్తామని వాట్సాప్ గ్రూప్‌లో సమాచారం పెట్టారు. అయితే అధినేత పవన్‌కల్యాణ్ మాత్రం లోకల్, నాన్ లోకల్ సమస్యను పక్కన పెట్టి జనసేన అభ్యర్థి గెలిచేలా పనిచేయాలని, లేదంటే క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించడం వల్లనే జనసేన నేతలు మెత్తబడినట్లు సమాచారం. టిడిపి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్‌లను పదవుల ఆశ చూపి సర్దుబాటు చేయడంతో టిడిపి, జనసేన నేతలు కలిసి ఒకే తాటిపైకి వచ్చి ఆరణి శ్రీనివాస్‌ను అభ్యర్థిగా అంగీకరించినట్లే.

సత్యవేడు నుంచి పోటీ చేస్తా : జేడీ రాజశేఖర్

సత్యవేడు టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ఆదిమూలం పేరు ఖరారయ్యింది. అయితే సత్యవేడు ఎంఎల్‌ఎ అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని జేడీ రాజవేఖర్ తిరుపతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కార్యకర్తలంతాను తాను పోటీలో ఉండాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఒకవేళ ఆదిమూలంకే టిక్కెట్‌ను అధినేత ప్రకటిస్తే, జేడీ పరిస్థితి ఏంటన్నది వేచి చూడాల్సిందే.

నేడు జాతీయ లోక్ అదాలత్

- ఉచితంగా కేసులు పరిష్కరించుకోచ్చు..
- అదాలత్‌కు 37 ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా భవనంలో ఈ నెల 16న శనివారం జిల్లాలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై మీడియా సమాశం నిర్వహించి మాట్లాడారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటుగా 13మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో 37బెంచ్‌లు ద్వారా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ.. మామూలుగా కోర్టులలో తీర్పు చెప్పినప్పుడు ఒకరు విజయం సాధిస్తే మరొక్కరు అపజయ అవుతారని, దీనికి విభిన్నమైన రీతిలో లోక్ అదాలత్‌లో కక్ష దారులు మధ్య వర్తిత్వం ద్వారా మాట్లాడుకోవడంతో వివాదన్ని సున్నితంగా పరిష్కారం చేసుకోవడం జరుగుతుందన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పిస్తున్న సమ న్యాయం, సామాజిక న్యాయం, సత్వర న్యాయం కోసం గౌరవ సుప్రీంకోర్టు వారు అనేక సందర్భాలలో కక్ష దారులకు సత్వర న్యాయం అందించుటకు లోక్‌అదాలత్‌ను చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఇ.భీమారావ్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 37బెంచ్‌ల ద్వారా 1500కేసులను రాజీ చేయుటకు గుర్తించడం జరిగిందని వివరించారు. ముందస్తుగానే ఫ్రీ లోక్ అదాలత్ బెంచీలు ద్వారా మధ్యవర్తిత్వం జరిపి 400వందల కేసులు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. అదాలత్‌లో భూ సమస్యలు, సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, బ్యాంక్స్, ప్రైవేటు చిట్ ఫండ్ కంపెణిలు, బీమా సంస్థల, చెక్ బౌన్స్, బిఎస్‌యన్‌యల్, యం.వి.ఐ, భార్యాభర్తలకు సంబంధించి కేసులు పరిష్కరం చేసుకోవచ్చునని తెలిపారు.

స్విమ్స్‌కి వస్తే 'భౌభౌ'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఉన్న జబ్బుకు చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యం మాట దేవుడెరుగు, అక్కడ గ్రామసింహాలు (కుక్కల) నుంచి తప్పించుకోకపోతే బొడ్డు చుట్టూ 14 ఇంజెక్షన్లు వేసుకోక తప్పదు. అదేదో మారుమూల ప్రాంతంలోని ప్రాథమిక వైద్యశాల్లో కాదు. రాష్ట్రంలోనే పేరెన్నికగన్న, ధార్మిక సంస్థ టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్‌లో.

శ్రీవెంకటేశ్వరవైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్). దీనికి అనుబంధంగా దేశంలోనే మొట్టమొదటి మహిళా మెడికల్ కళాశాలగా పేరుగాంచిన శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల, దానికి అనుగుణంగా శ్రీపద్మావతి మహిళా వైద్యకళాశాల ఆసుపత్రి. స్విమ్స్ నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల ఉన్నాయి. స్విమ్స్ వైస్‌చాన్సలర్ బంగ్లా, రిజిస్టిర్ బంగ్లా, ఇతర అధికారులు, స్టాఫ్ క్వార్టర్స్, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఫిజియోథెరపి విద్యార్థుల హాస్టల్స్ ఆ ఆసుపత్రి ప్రాంగణంలోనే ఉన్నాయి. 1200 పడకల సామర్థ్యంతో స్విమ్స్ నడుస్తోంది. ప్రతి రోజూ ఓపిల కోసం తిరుపతి జిల్లాతో పాటు చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకకు చెందిన రోగులు నిత్యం 3000 మందిపైగా వస్తుంటారు. ఇక ఇన్‌పేషెంట్లు, అత్యవసర వైద్యం కోసం వచ్చేవారు మరో 1500 మంది వరకు ఉంటారు. రోగులతో పాటు వారి సహాయకులు, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు, అధికారులు మరో 5వేల మంది అదనం. స్విమ్స్ పక్కనే వికలాంగులకు, మోకాళ్లు, తుంటి, ఎముకుల సమస్యలకు అత్యాధునిక పద్ధతిలో చికిత్స అందించే దేశంలోనే మొట్టమొదటి ఎముకులు, కీళ్ల విభాగంలో సూపర్‌స్పెషాలిటీ బర్డు ఆసుపత్రి ఉంది. దేశంలో పిల్లల గుండె జబ్బులకు కోసం ఏర్పాటు చేసిన ఏకైక శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె ఆసుపత్రి ఉన్నాయి. దీనికి సమీపంలోనే ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల, రుయా ఆసుపత్రి, ఎస్‌వి మెడికల్ కళాశాల, చిన్న పిల్లల ఆసుపత్రి కలవు. ఇంతటి ప్రాధాన్యత గల ఈ ప్రాంతంలో రోగులకు దీటుగా కుక్కలు కూడా అధికంగానే ఉన్నాయి. స్విమ్స్ డైరెక్టర్ చాంబర్, ఇన్‌పేసెంట్లు వార్డు, క్యాంటీన్ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కుక్కులు పడకేసి ఉంటాయి. నడవలేని పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఆ కుక్కుల నుంచి తప్పించుకుని వార్డుకు, ఓపి విభాగానికి చేరుకోవాలంటే ఓ పద్మవ్యూహం దాటాల్సిన పరిస్థితి. రోగులు, కుక్కలు భయం భయంగానే నడవాల్సి ఉంటుంది. అటుగా వచ్చే వాహనాదారులు, పాదచారులపై కుక్కలు దాడికి పాల్పడుతున్నాయి. ఉన్న జబ్బులకే సూదులు వేసుకోలేక అవస్థలు పడుతుంటే కుక్క కాటుకి 14 సూదులు, అది కూడా బొడ్డుచుట్టు ఎక్కడేసుకునేది స్వామి అంటూ అటుగా వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా స్విమ్స్ అధికారులు స్పందించి, అక్కడున్న కుక్కలను కార్పొరేషన్‌కు అప్పగించి, రోగులు, సహాయకులు, సిబ్బంది ఇబ్బంది పడకుండా చూడాల్సి ఉంది.

స్విమ్స్ ప్రాంగణంలో కుక్కల స్వైరవిహారం

ఘనంగా టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలు

- లబ్దిదారులకు పట్టాలు, తాళాలు పంపిణీ

లబ్ధిదారులకు ఇంటిపట్టా, తాళాలు అందజేస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లోని ఇళ్లకు గృహప్రవేశాల కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ అముద, కమిషనర్ డాక్టర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డిలు లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. తోరణాలు కట్టి, పూజా కార్యక్రమాలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా గృహప్రవేశాలు చేశారు. గృహాలకు సంబంధించిన పట్టా, ఇంటి తాళాలను సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు వారి గృహాల్లో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మేయర్ అముద మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ సముదాయంలో విద్యుత్ సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, ఎస్టీపి ప్లాంట్, నీటి శుద్ధి కేంద్రం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటి తాళాలు పొందిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టిడ్కో ఈఈ వెంకటముని, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ మహిళా కన్వీనర్‌గా భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అన్ని రంగాల్లో స్త్రీ పురుష సమానత్వం రావాలని, లింగ వివక్ష రూపుమాపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శుక్రవారం సీఐటీయూ అనుబంధ ఆర్టీసీ మహిళా విభాగం స్థాఫర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. మహిళలకు అన్ని రకాలుగా రక్షణ కల్పించడంతోపాట, చట్టసభల్లో మహిళా ప్రాధాన్యతను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్డబ్ల్యూఎఫ్ మహిళా విభాగం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా భాగ్యలక్ష్మి, కో-కన్వీనర్ గా శారద, సభ్యులుగా మస్తానమ్మ, వినీల, లిల్లీ, రాజేశ్వరి, శిరీష, మమత, రెడ్డి వాణి ఎన్నికయ్యారు. ఎస్డబ్ల్యూఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, శివకుమార్, సిఐటియు నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కె రోజాకు సీటు ఇస్తే పార్టీకే నష్టం: మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నగిరి నియోజకవర్గంలో మంత్రి రోజాకు మళ్లీ ఎమ్మెల్యే సీటు అధిష్టానం ఇస్తే నష్టపోక తప్పదని, తామెవ్వరం పనిచేయబోమని నగరి నియోజకవర్గ పరిధిలోని నింద్ర, పుత్తూరు, వడమాల పేట, విజయపురం, నగరి మండలాలకు చెందిన వైసిపి నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడమాలపేట జడ్పిటిసి సభ్యుడు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే మంత్రి రోజా పట్ల నగరి నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసంతప్తితో ఉన్నారని, నియోజకవర్గ వైసిపి క్యాడర్ ఆమె ప్రవర్తన పట్ల విసుగుచెంది ఉన్నారన్నారు. జగన్ నాయకత్వంలో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ మంత్రి రోజాకు ఎన్నికల్లో ఎటువంటి సహకారం అందివ్వమన్నారు. ఇదే విషయాన్ని అధిష్టానంకు తెలిపినా ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. నగరి నియోజకవర్గ వైసిపి పార్టీ క్యాడర్ కు వ్యతిరేకంగా అధిష్టానం నిర్ణయం తీసుకుంటే నగరి స్థానాన్ని పార్టీ కోల్పోవాల్సి వస్తుందన్నారు. మాజీ ఎంపీపీ ఏలుమలై(అమ్ములు) మాట్లాడుతూ రోజా కోసం ఎన్నికల్లో కష్టపడి ఆమెను ఎమ్మెల్యేను, మంత్రిని చేస్తే ఇప్పుడు తమను వేధిస్తోందని, అధికారం చేతబెట్టుకుని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. 'జగన్ ముద్దు-రోజా వద్దు' ప్లే కార్డులను ప్రదర్శించారు. ఈసమావేశంలో ఎంపీటీసీ లక్ష్మీపతిరాజు, మాజీ సర్పంచి రవిశేఖర్ రాజు, ఎంపీటీసీ రెడ్డివారి భాస్కర్ రెడ్డి, సర్పంచి తులసీరామ్ రెడ్డి, మునీంద్ర, వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో సమర్థవంతంగా పనిచేయాలి: కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని క్షేత్రస్థాయిలో మరింత సమర్ధవంతంగా పనిచేయాలని కమిషనర్ డాక్టర్ అరుణ అన్నారు. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ (ఏఐఐఎల్ఎస్‌జీ) ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0లో "స్వచ్ఛత మార్గదర్శక్ ప్రోగ్రాం" శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమన్నారు. 2016 సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. తడి, పొడి వ్యర్థాలను వేరువేరుగా సేకరించడం, ప్లాస్టిక్‌నిషేధం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే ప్రజలకు తెలియజేసి వారిని చైతన్యవంతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంహెచ్‌వో చిన్నయ్య, ఏఐఐఎల్ఎస్జీ ప్రతినిధులు కేత్న అతుల్, రాజేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, వార్డు పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులు, మేస్త్రిలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ పరిధిలో పని చేయాలి: జెసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: షెడ్యూల్ వచ్చాక ఎన్నికల కమిషన్ పరిధిలో పనిచేయాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం చిత్తూరు పీవీకేఎన్ కళాశాలలో జరుగుతున్న పోలింగ్ అధికారుల శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. 16న శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో కమిషన్ పరిధలో పనిచేయడానికి సమాయత్తం కావాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లొంగవద్దన్నారు. శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఎన్నికల మ్యాన్యువల్ అత్యంత ప్రధానమైనదని, మ్యాన్యువల్‌ను పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

నేడు టీడీపీ, జనసేన ఇంటింటి ప్రచారం

బాబు నాయుడు

ప్రజాశక్తి-గుడుపల్లె: టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు శనివారం నుంచి గుడుపల్లెలో ఇంటింటి ప్రచారం ప్రారంభించనున్నట్లు శుక్రవారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బి.ఎం బాబు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. పొత్తులో భాగంగా అందరి నాయకుల సమన్వయంతో టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. 18గ్రామ పంచాయతీలలో బూతు వారీగా ఇంటింటి పర్యటన చేపడతామన్నారు. తొలి రోజు శనివారం బెగ్గిలపల్లిలో కార్యక్రమం ప్రారంభించి, చివరిగా ఓఎన్ కొత్తూరు పంచాయతీలో ముగుస్తుందని ఆయన స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరవ్వాలని ఈ సందర్భంగా కోరారు.

సీఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: అనారోగ్యంపాలై ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలను సీఎం సహాయనిధి ఆదుకుంటోందని మంత్రి రోజా అన్నారు. శనివారం తన నివాస వద్ద 64మందికి రూ.45.74లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఆమె అందజేశారు.

263 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సోమల: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా 263 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ జయసింహ తెలిపారు. శుక్రవారం మండలంలోని 81చిన్న ఉప్పరపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు చేయించుకున్న ప్రజలకు ఉచితంగా మందులు అందించామన్నారు.

తారు రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి వెదురుకుప్పం వరకు తారు రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.40లక్షలతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఎంపీటీసీ రాధిక పురందర్‌రెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డి, వైసీపీ నేత సుబ్రహ్మణ్యం, ఏకు మురళీ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పంలోని శ్రీ వల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి ఆలయంలో స్కంద షష్టి సందర్భంగా కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం తుంగల కుప్పం గ్రామానికి చెందిన భక్తులు ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి, మంగళ వాయిద్యాలు మంత్రోచ్ఛారణ నడుమ కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

అందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం: శేఖర్‌రాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే సీఎం జగనన్న లక్ష్యమని మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎంఎం విలాసం సచివాలయం ఆవరణలో సర్పంచ్ పవన్‌కుమార్, జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కన్వీనర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని విధంగా సీఎం జగనన్న తన పాలనలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు, ఎంపీటీసీ దేశమ్మ, వైద్యాధికారిణి భువనేశ్వరి, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, వైద్యాధికారులు, నాయకులు మాణిక్యంరెడ్డి పలువురు పాల్గొన్నారు.

మొగిలీశ్వర స్వామికి తెప్పోత్సవం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ రోజు శుక్రవారం మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభూగా వెలసి ఉండు శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామికి ఆలయంలోని కోనేటిలో తెప్పోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉభయదారులుగా మొగిలికి చెందిన మొగిలీశ్వర ట్రాన్స్‌పోర్ట్, గణేష్ బాయ్స్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునిరాజులు తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ గెలుపునకు సహకరించాలి'

ప్రజాశక్తి-పూతలపట్టు: రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపునకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ నాయకులు జగదీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీ సభ్యులకు ఓటర్ల లిస్టు, పార్టీ కరపత్రాలను అందజేశారు. అనంతరం పార్టీలోని అంతర్గత విషయాలపై చర్చలు జరిగాయి. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు సచివాలయంలో శుక్రవారం అర్హులైన లబ్ధిదారులకు సర్పంచ్ రమేష్ బాబు ప్రభుత్వం నుండి మంజూరైన ఇళ్ల పట్టాలను స్థానిక సచివాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కూడా మంజూరు చేశారని, ఇటీవల ప్రభుత్వం నుండి ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు వారి వారి ఇంటి స్థలానికి సంబంధించిన ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బసవరాజకండ్రిగ సమీపంలో ఉన్న కాలనీలో 50మంది లబ్ధిదారులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి ప్రభుత్వం నుండి మంజూరైన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, వీఆర్వో సుధాకర్, సచివాలయ వెల్ఫేర్ అధికారి నజీర్ భాషా, నాయకులు సుబ్రమణ్యం, ప్రకాష్, మునిరాజ, వాలంటీర్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

'అరుణమ్మా.. ఆశీర్వదించండి'

గల్లా అరుణకుమారిని సత్కరిస్తున్న డాక్టర్ మురళీమోహన్

ప్రజాశక్తి-ఐరాల: ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు సహకరించి ఆశీర్వదించాలని మాజీ మంత్రి అరుణకుమారిని టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ కోరారు. శుక్రవారం తిరుపతి కరకంబాడి సమీపంలోని గల్లా అరుణకుమారి నివాసం వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించి ఆశీర్వాదం అందుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు సహకరించాలని విన్నవించారు. ఆయన వెంట నాయకులు బొమ్మన శ్రీధర్, యువరాజుల నాయుడు, దొరబాబు చౌదరి, గాలి దిలీప్ కుమార్, మురళీ యాదవ్, గిరినాయుడు, వెంకటేష్ చౌదరి, వెంకటేష్ రెడ్డి, చంద్రమౌళి, మోహన్ నాయుడు, సునీల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'

ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలని టీడిపి నేతలు కోరారు. శుక్రవారం వారు ఆవులకుప్పం, ముద్దనపల్లేలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నవరత్నాల పేరిట వైసీపీ ప్రభుత్వం ప్రజల్ని వంచించిందన్నరు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాల్నాటే తిరిగి టిడిపి ప్రభుత్వం వస్తేనే సాధ్యమవుతుంది. దీనిని గుర్తించి ప్రజలు ముక్త కంఠంతో టిడిపికి అండగా నిలవాలని కోరారు.వచ్చే ఎన్నికల్లో తీడిపీకి ఘన విజయం అందించాలని వారు కోరారు. కార్యక్రమాల్లో మునస్వమి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి నరసింహులు, మనోహర్, గజేంద్ర, త్యాగరాజ్, మురళి, రఘు, వెంకటేష్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన మసీదులు



ప్రజాశక్తి-సోమల: రంజాన్ మాసం ప్రారంభం అయి మొదటి శుక్రవారం కావడంతో మండలంలోని పలు మసీదులలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమల కందూరు పెద్ద ఉప్పరపల్లి నవాబుపేట నంజంపేట పెద్ద ఉప్పరపల్లి ఇరికిపెంట గ్రామాలలోని మసీదులలో ముస్లిం సోదరులు మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ముఖ్యంగా రంజాన్ మాసంలో ఉపవాసాలు (రోజా) పాటిస్తూ వస్తుంటారు. సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం రాగానే ఉపవాసాలను తీర్చుకుంటూ భక్తిశ్రద్ధలతో రంజాన్ మాసంలో పవిత్రంగా నియమ నిష్టలతో ఉండడం జరుగుతుంది.

ప్రతి గడపకూ సంక్షేమం: ఎంపీపీ

ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందించిందని ఎంపీపీ సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని భయపరడ్లపల్లిలో 'గడప గడపకు సంక్షేమం' అనే కార్యక్రమన్ని ఎంపిపి అధ్వర్యంలో నిర్వహించారు. చెప్పాడంటే చేస్తాడంతే అనే నినాదంతో గడప గడపకు వైసీపి ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. రాబోయే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే భవిష్యత్తులో ఇంకా అనేక రకాలుగా లబ్ధి పొందవచ్చు అని ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందప్ప, కేశవరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ నారాయణస్వామి, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజశేఖర్, సోమప్ప, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని వెలుగు సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ రహీం మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై సంఘమిత్రలకు ఐకేపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపిఎం కృష్ణప్ప, సీసీలు సంఘమిత్రలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూడండి.. గెలిపించండి: భరత్

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ భరత్

ప్రజాశక్తి-శాంతిపురం: ఐదేళ్లుగా కుప్పంలో చేసిన అభివృద్ధిని చూసి గెలిపించాలని ఎమ్మెల్సీ భరత్ ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని సొన్నేగానిపల్లి పంచాయతీలో అమ్మవారికి పూజలు నిర్వహించి వైసీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సతీమణి దుర్గ, జెడ్పిటిసి సభ్యులు శ్రీనివాసులు మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు విజయ్‌కుమార్, అశ్వత్, పెద్దన్న, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో జిల్లా పోలీసు అధికారులు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్ఐ వెంకటమోహన్ ఆధ్వర్యంలో పెద్ద ఉప్పర పల్లి, కమ్మపల్లి, నెల్లిమంద, నంజంపేట కందూరు లో కవాతు చేపట్టారు. రానున్న ఎన్నికలలో ఓటర్లు ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రావాలన్న ఉద్దేశంతో కవాతు నిర్వహించినట్టు ఎస్ఐ తెలిపారు.

సదుం: మండల పరిధిలోని రెడ్డివారిపల్లి, పాలమంద, తాటిగుంట పాళ్యం, బూరగమంద, చీకల చేను, తిమ్మానాయుని పల్లి తదితర ప్రధాన రహదారులు, కాలనీలలో చౌడేపల్లి సిఐ కృష్ణారెడ్డి, సదుం ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని సదుం ఎస్ఐ మారుతి శుక్రవారం విలేకరులకు తెలిపారు.

ఉపాధ్యాయ అక్రమ బదిలీలపై నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: విద్యా శాఖలో 1200కు పైగా అక్రమ బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తడ, సూళ్లూరుపేట, దొరవారి సత్రం మండల శాఖల నాయకులు నిరసన చేపట్టారు. సూళ్లూరుపేట మండలంలో అచ్చుకట్లలో ఒకరికి, మన్నారు పోలూరు హైస్కూల్లో ఒకరికి, తడ మండలంలో ఇద్దరికీ, దొరవారి సత్రం మండలంలో ఇద్దరికీ దొడ్డిదారిన బదిలీలు ఆర్డర్లు వచ్చాయి. ఈ బదిలీలను నిరసిస్తూ యుటిఎఫ్ సూళ్లూరుపేట తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఉపాధ్యాయ కౌన్సిలింగ్ విధానానికి తూట్లుపొడిచి, అక్రమ బదిలీలను ప్రభుత్వం బేషరతుగా చిత్తశుద్ధితో ఆపాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని యుటిఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు జి.జె.రాజశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ కేఎంఎస్ సునీల, జిల్లా కార్యదర్శి కావూరు ప్రభాకర్, సూళ్లూరుపేట అధ్యక్షులు ఎం. రామ్మూర్తి, ఓ.శ్రీనివాసులు, వెంకటస్వామి, శ్రీనివాసులు, గాలి ఉషారాణి, మహిళా కమిటీ కన్వీనర్లు సిహెచ్ రాజేశ్వరి, ధనలక్ష్మి, బొబ్బిలి చంద్రశేఖర్, సిహెచ్ ఆయన భాస్కరు, జెవిపి అధ్యక్షులు కే. రాజేష్ బాబు మూడు మండలాలకు చెందిన 30 మంది నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి: సిడిపిఓ

ప్రజాశక్తి - ఓజిలి :

ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకుని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని సిడిపిఓ కె. ఉమామహేశ్వరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐసిడిఎస్ సెక్టార్‌లోని అరుంధతివాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ శ్యామల ఆధ్వర్యంలో సూపరువైజరు సుజన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిడిపిఓ కె ఉమామహేశ్వరి, వైద్యులు డేనియల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. విటమిన్స్, ప్రోటీన్లు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషణ విలువలు ఏ ఆహార పదార్థాల్లో లభిస్తాయో గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు వివరించారు. మహిళలు రక్తహీనత బారిన పడకుండా ఏ ఆహారం తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి సరస్వతి, టీచర్ విజయ , ఆషాబేగం బంగారమ్మ, స్వర్ణలత, ఆశ వర్కరు, గర్భిణులు, అంగన్‌వాడీ చిన్నారులు పాల్గొన్నారు.

వైసీపీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-సదుం:

మండల పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 400మంది వైసీపీ నాయకులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అభిమానులు పెద్దఎత్తున హాజరైయ్యారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నారాయణరెడ్డి, అన్నారెడ్డి, శివారెడ్డి, మల్లికార్జున, శ్రీరాములు, రామచంద్రయ్య, అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం 1000 ద్విచక్ర వాహనాలతో పలు గ్రామాల మీదుగా సోమల బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాలతో శంఖారావంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించినట్టు నాయకులు అమాస మోహన్, ప్రభాకర్, గణపతి వెంకటరమణారెడ్డి, రాజారెడ్డి తెలిపారు.

వైసీపీ ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర అభివృద్ధి శూన్యం

- మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపంజాణి:

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని జగన్‌రెడ్డి సైకో పాలనను అంతమొందించేందుకు ప్రతి ఒక్కరు పంతంతో ఈ నెల రోజులు పనిచేయాలని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని రాయలపేట పంచాయితీ పరిధిలోని చెన్నారెడ్డిపల్లి, రాయలపేట కేంద్రంలో ఆయన ఇంటింటికి తెలుగుదేశం, బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా పర్యటించారు. మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను అందిస్తూ పర్యటన సాగించారు.

టీడీపీలో చేరికలు..

మండల పర్యటన సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, యువత భారీగా మాజీ మంత్రి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాయలపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ బుద్ధు చంద్రశేఖర్, శివ, కిట్టప్ప, నాగేష్, లక్ష్మిపతి, గౌదమాకులపల్లికి చెందిన శంకర్‌రెడ్డి తదితరులు పార్టీలో చేరారు.

విద్యార్థి దశ నుంచే ఆదర్శ ప్రాయంగా మెలగాలి

సోమలలో సరస్వతి పూజా కార్యక్రమం

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థి దశ నుంచే మంచి ప్రవర్తనతో ఇతరకు ఆదర్శ ప్రాయంగా మెలగాలని ఎంఈవో విజయకుమార్ అన్నారు. శుక్రవారం డీఎం పురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావడానికి కృషి చేయాలని సూచించారు. ఎంపీటీసీ దనశేఖర్ క్రీడల్లో గెలుపొందిన వారికి రూ.15వేలు నగదు బహుమతిని అందించారు. అనంతరం విశ్రాంతి ఉపాధ్యాయుడు, పాఠశాల వ్యవస్థాపకులు మునిక్రిష్ణ పిళ్లై పేరు మీద గత కొన్ని సంవత్సరాలుగా 10వ తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందించడం ఆనవాయితీ అన్నారు. ఈ క్రమంలో భాగంగా విద్యార్థులు సరస్వతి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఓం అక్షరాన్ని ఏర్పాటు చేసి కొవొత్తులు వెలగించారు. వీడ్కోలు సమావేశం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమంలో విద్యార్థులు చూపరులు ఆకట్టుకునే నృత్యాలు చేశారు.

సోమల: మండలంలోని నెల్లిమంద ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతి పూజ నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి ఓం ఆకారాన్ని పూలతో అలంకరించి క్యాండిల్స్ వెలిగించి అందంగా తీర్చిదిద్దారు. అంతకుముందు సరస్వతి చిత్రపటానికి పూజలు నిర్వహించి విద్యార్థులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మహాలక్ష్మి, సిబ్బంది అమృతవల్లి తాయారు, గీత, వసంత కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని హెచ్ఎం సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని రాగిమాను పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వీడ్కోలు సమావేశం జరగింది. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి లోనే ఉత్తమ ఫలితాలు సాధించాలని ఫలితాలు సాధించేందుకు నిత్యం విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా తయారు కావాలని అన్నారు. మొదట సరస్వతీ విగ్రహానికి ఓంకారానికి ప్రత్యేక పూజలు కార్యక్రమం చేపట్టి అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సందేశం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇరసయ్య, శారద, మురగయ్య, దశరథం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: చక్కని ఆహ్లాదకరమైన వాతనరణంలో ఉన్న కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ నందు, సరస్వతి విగ్రహం ప్రతిష్ట శుక్రవారం కార్యక్రమం చేపట్టారు. ఉపాద్యయ బృందం, తల్లిదండ్రులు స్పందించి రూ.1.50లక్షలతో సరస్వతి దేవి విగ్రహ నిర్మాణ పనులకోసం శుక్రవారం భూమి పూజ నిర్వహించినట్లు హెచ్ఎం లలిత తెలిపారు. బంగారుపాళ్యం ఎంఈవో రమేష్ బాబు, కమీటి చైర్మన్ గోపి, సర్పంచ్ రాధ, మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-శాంతిపురం: టీడీపీ అధినేతను లక్ష మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా ప్రచారం చేపడుతున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు శాంతిపురం మండలం కోతిగుట్లపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుప్పం మండల మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ ఆధ్వర్యంలో టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించి టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కందస్వామి, శాంతిపురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శివప్రసాద్, మాజీ ఎంపీపీ పుష్పలత, మాజీ జెడ్పిటిసి శకుంతల, బూత్ ఇంచార్జ్ ప్రసాద్, స్థానిక టిడిపి నాయకులు బద్రి, నారాయణ స్వామి, బాబు, సురేష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో మహిళల జీవితాల్లో వెలుగు: థామస్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకం మహిళా జీవితాల్లో వెలుగులు వస్తాయని టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, జనసేన ఇన్‌ఛార్జ్ యుగంధర్‌లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాలగంగానపల్లి పంచాయతీలో 'మీ ఇంటికి మీ థామస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి టిడిపి మేనిఫెస్టోను ఇంటింటికి అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్, జిల్లా కార్యదర్శి కృష్ణమనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, టిడిపి మాజీ సర్పంచులు దేవరాజులు, బాలచంద్రారెడ్డి, యువ రాజారెడ్డి, జ్యోతి యాదవ్, సతీష్, సగికుమార్, కృష్ణారెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -రేణిగుంట : ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో వెంకటాపురం పంచాయతీ అన్నాసామీ పల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రిని ముఖ్య అతిథి మండల కో ఆప్షన్ సభ్యులు హాసన్ సాహెబ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హసన్ సాహెబ్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థులందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి విద్యార్థులు రావాలని కోరారు. జూలియన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందనే వీటిని అందించామన్నారు. పదో తరగతి నుంచి 8 సంవత్సరాలు కష్టపడి చదివితే జీవితాంతం సంతోషంగా గడపచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సునీత గౌడ్, రవి కుమార్, శ్రీను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : న్యూఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ 70వ వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకుని బహుభాషా కవి సమ్మేళనం అనే జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సంస్కృత భాష భారతీయ భాషల్లో ఉన్న ఔన్నత్యాన్ని తెలిపే చక్కటి కవితల్ని రచించి చదివి వినిపించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని చిలంపల్లిలో వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. చిలంపల్లికి చెందిన భాగ్యమ్మ, కృష్ణప్ప దంపతులు. గురువారం రాత్రి ఇరువురి మధ్య తగువు ఏర్పడింది. శుక్రవారం ఉదయం భాగ్యమ్మ గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

వైసీపీతోనే అతివకు అందలం: రోజా

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మహిళల అభివృద్ధికి, సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి రోజా అన్నారు. శుక్రవారం నగరి ఏజేఎస్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన 4వ విడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ భారీ బహిరంగ సభకు ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మధ్యవయస్సు మహిళల కష్టాలు దూరం చేయడమే చేయూత లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడా ఈ పథకం అమలులో లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, ప్రజా ప్రతినిధులు, శ్రేణులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ హోటల్ నిర్వాహకులు టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-వెదురుకుప్పం: టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ నూతన గృహప్రవేశం పుత్తూరు కళ్యాణపురంలో శుక్రవారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆరు మండలాల టీడీపీ, జనసేన పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్వేటినగరం మండలానికి సంబంధించిన వైసీపీకి చెందిన పుత్తూరులో శ్రీకృష్ణ హోటల్ నిర్వాహకులు బాబు, ఆయన సతీమణి తులసి డాక్టర్ థామస్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

'ఎస్‌బీఐ సేవలు సద్వినియోగం చేసుకోండి'

ప్రజాశక్తి-పూతలపట్టు: ఎస్‌బీఐ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డీజీఎం వరదరాజన్ గారు కోరారు. శుక్రవారం మండలంలోని కమ్మ గుట్టపల్లి గ్రామంలో ఎస్‌బీఐ సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీడీవో ప్రసన్నకుమారి, సర్పంచ్ సురేఖ, చిత్తూరు ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కిషోర్‌కుమార్, మేనేజర్ శంకర్ రెడ్డి, ఎంపీటీసీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి మున్సిపాలిటీ రామ్ నగర్ కాలనీకు చెందిన వైసీపీ నాయకులు బాబు బాయ్, సికిందర్ బాయ్, మెకానిక్ రఫీ, అల్లావుద్దిన్‌లు టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

ఆల్ రౌండర్‌గా నిలిచిన విద్యార్థులు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి నారాయణ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లా సైన్స్ విజార్డ్ కాంపిటీషన్లో ఆల్ రౌండర్ వినర్‌గా నిలిచారని శుక్రవారం ఏజీఎం కిషోర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. సైన్స్ ఎక్స్‌పరిమెంట్ వాటి ప్రాధాన్యత, నిత్య జీవితంలో వాటి ఉపయోగాలు గురించి ప్రిన్సిపల్ కార్తీక్ విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, ప్రిన్సిపల్ గాయత్రి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-శాంతిపురం: కుప్పం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ స్వామి శుక్రవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీని వీడి డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు విశ్వనాథ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో చంద్రబాబు నాయుడును మించిన ప్రత్యామ్నయం మరొకటి లేదన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు ఎంతో అవసరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్, విజయ్‌రామిరెడ్డి, ఆర్ఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE CUM JFCM OF CHITTOOR
O.S.No. 754 OF 2023

Between:-
D.Sathyanarayana ....Plaintiff
And :-
T. Tilak Prasad ...Defendant

SUIT SUMMONS TO DEFENDANT

To
T. Tilak Prasad,
S/o Late T.Devarajulu,
aged 47 years, Hindu,Business,
Residing at D.No.4-45/2,
Balaji Nagar Colony,
Chittoor Town and District -AP

Please take notice that the above case stands posted to your appearance on **01.04.2024 at about 10-30 A.M** before the above court. If you failed to appear either in person or through your counsel on that date the matter will be decided in your absence on merits.

Sd/- K.BALACHANDRA
Advocate for the plaintiff